ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 3 ఫిర్యాదులు అందాయని సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గురుద్వార్ అధ్యక్షుడిగా సర్దార్ చేతన్ సింగ్ షికారి



అత్తాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సిక్కు కుటుంబాలకు రావాల్సిన హక్కులను సాధించి ప్రతి సిక్కు కుటుంబానికి అందిస్తానని గురుద్వార్ అధ్యక్షులు సర్దార్ చేతన్ సింగ్ షికారి అన్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో సర్దార్ సుఖదేవ్ సింగ్‌పై 221 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా సిక్కు సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ సిక్కుల కోసం మైనార్టీ సెల్ సపరేట్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదరికంలో మగ్గిపోతున్న యువతీ, యువతులకు విద్యా ఉపాధి రంగంలో రాణించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థిని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని కోరారు. తన విజయానికి కారణమై ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

అత్తాపూర్: మాజీ మంత్రి మహేందర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డీసీకి ఫిర్యాదు



డీసీ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధనుంజయ తదితరులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ధనుంజయ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయకుల బృందం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబుల్‌రెడ్డి నగర్‌లో సీసీ రోడ్లు, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని, చెరువు సుందరీకరణతో పాటు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ కార్యదర్శి ఓంప్రకాశ్, బస్తీ పెద్దలు సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రిన్సిపాల్ నౌషిన్ ఫాతీమా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఏజీఎం రవీంద్ర బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తమ మనుమలు, మనవరాళ్లతో కలిసి ఈ సందర్భంగా అమ్మమ్మ, నానమ్మ, తాతలు ఉత్సాహంగా గడిపారు. పెద్దల పట్ల పిల్లలకు గౌరవం పెంచాలనే ఉదేశంతో ఈ గ్రాండ్ పేరెంట్స్ డేను నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆటో బోల్తా



శంషాబాద్ రూరల్: రహదారిపై ఉన్న భారీ గోతుల కారణంగా ఆటో బోల్తా పడిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. శంషాబాద్–షాబాద్ రహదారిలో కవేలిగూడ చౌరస్తా వద్ద రోడ్డుపై భారీ గుంతలు పడ్డాయి. సోమవారం సాయంత్రం ఓ ప్యాసింజర్ ఆటో అటుగా వెళ్తూ బోల్తా పడింది. ఆటోపై భాగంలో ఇనుప పైపుల లోడు ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రయాదం జరగలేదు. రహదారిపై గోతులతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపు తప్పి చెరువులోకి...



శంషాబాద్ రూరల్: మితిమీరిన వేగంతో కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు ప్రాంతానికి చెందిన వ్యక్తులు సోమవారం కారులో పెద్దతూప్ర గ్రామం వైపు నుంచి తిమ్మాపూర్ చౌరస్తాకు వస్తున్నారు. పెద్దతూప్ర గ్రామ శివారులో ఉన్న వెంకట చెరువు కట్టపై ఉన్న మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి పక్కన ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. చెరువులో నీళ్లు ఎక్కువగా లేకపోవడంతో ఒడ్డున పడ్డగా, కారులోని ప్రయాణికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

పెరిగిన శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి

- విలీన పంచాయతీల రికార్డులు స్వాధీనం
- పంచాయతీ కార్యాలయాలే వార్డు కార్యాలయాలుగా బోర్డులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



కార్యదర్శుల నుంచి రికార్డులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు



పురపాలక సంఘం వార్డు కార్యాలయాలుగా ఫ్లెక్సీలతో చేసిన బోర్డుల ఏర్పాటు

శంషాబాద్: ఇటీవల ప్రభుత్వ ఆర్డినెన్స్ ద్వారా శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన 6 గ్రామ పంచాయతీల రికార్డుల స్వాధీన ప్రక్రియ సోమవారం అధికారులు పూర్తి చేశారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, మేనేజర్ శ్రావణి తదితరులు ఉదయం నుంచి చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సిమియాగూడ, బహదూర్‌గూడ గ్రామపంచాయతీల కార్యదర్శులు పంచాయతీలో ఉన్న అన్ని రికార్డులను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయాకు వెంటనే శంషాబాద్ పురపాలక సంఘం వార్డు కార్యాలయాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి వరకు రికార్డుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది.

2019 మున్సిపాలిటీగా..

శంషాబాద్ మున్సిపాలిటీ 2019 మార్చి నెలలో ఏర్పడింది. శంషాబాద్ మేజర్ గ్రామ పంచాయతీతో పాటు సమీపంలో ఉన్న గొల్లపల్లి, ఊట్‌పల్లి, తొండుపల్లి, కొత్వాల్‌గూడ, సాతంరాయి గ్రామాలతో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. తొలుత 3 గ్రామాలైన తొండుపల్లి, ఊట్‌పల్లి, గొల్లపల్లిలో మున్సిపాలిటీ ప్రారంభమైంది. శంషాబాద్ మేజర్ పంచాయతీకి మరో నెల గడువు ఉండడంతో ఏప్రిల్ నెలలో దానిని విలీనం చేసుకున్న అనంతరం మే నెలలో పంచాయతీలుగా గడవులు ముగిసిన కొత్వాల్‌గూడ, సాతంరాయిలతో కలిపి పూర్తి స్థాయి మున్సిపాలిటీ ఏర్పడింది. 2020లో మున్సిపాలిటీ ఎన్నికలతో తొలిపాలకవర్గం ఏర్పడింది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో మరో 6 గ్రామ పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీ విస్తీర్ణంతో పాటు జనాభా ఓటు సంఖ్య కూడా పెరిగింది. మంగళవారం ఉదయం నుంచి విలీన గ్రామాలకు సంబంధించిన పూర్తి పరిపాలన మున్సిపాలిటీ ఆధీనంలోకి రానుంది.

బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్: బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు దయానంద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్వేల్, కిస్మత్‌పూర్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, అత్తాపూర్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిరంగి నాలా హిమాయత్‌సాగర్ నుంచి బుద్వేల్ గ్రామం, డైయిరీఫామ్ ద్వారా ఉప్పర్‌పల్లి, చింతల్‌మేట్ మీదుగా మీరాలం చెరువులో కలుస్తుందన్నారు. ఫిరంగి నాలా బుద్వేల్ గ్రామంలో బాలాజీ బిల్డింగ్‌తో పాటు పక్కనే నిర్మాణ సామగ్రి డంపింగ్ చేయడానికి వేసిన షెడ్డు మొత్తం ఫిరంగి నాలా భూమేనని అన్నారు. సంజీవనీ కాలనీ, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ శివారులో, వెనుకభాగం మొత్తం విల్లాస్ బఫర్ జోన్‌లో కడుతున్నారన్నారు. సిగ్నిచర్ విల్లాస్ మొత్తం బఫర్ జోన్‌లోనే నిర్మాణాలు చేపట్టారని, ఆక్రమించి నిర్మించిన కట్టడాలను గుర్తించి ఫిరంగి నాలాను పునరుద్ధరించాలని కోరారు.

పటాన్‌చెరు-సికింద్రాబాద్ బస్సు వేళలు

రాయదుర్గం: హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పటాన్‌చెరు–సికింద్రాబాద్ ఆర్డినరీ బస్సు రూట్ నంబర్–219 ఉదయం 5 గంటలకు బయలుదేరుతుంది. చివరి బస్సు రాత్రి 11 గంటలకు ఉంటుంది. ఇది పటాన్‌చెరు, ఇక్రిశాట్, ఆర్‌సీపురం, బీరంగూడ, అశోక్‌నగర్, లింగంపల్లి, చందానగర్, మదీనాగూడ, ఆల్విన్‌కాలనీ ఎక్స్‌రోడ్, మియాపూర్, నిజాంపేట్, జేఎన్‌టీయూ హెచ్, కేపీహెచ్‌బీ మెయిన్‌రోడ్డు, కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్, బాలానగర్, శోభనా థియేటర్, బోయిన్‌పల్లి, తాడ్‌బంద్, ప్యాట్నీ సెంటర్ మీదుగా సికింద్రాబాద్ వరకు నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి 10 నిమిషాలకో బస్సు ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి సూచించారు.

ఎస్ఎస్‌సీటీయూలో స్పాట్ అడ్మిషన్లు

అక్టోబర్ 3న నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాయదుర్గం: ములుగులోని సమ్మక్కసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెంటర్ యూనివర్సిటీగా వ్యవహరిస్తున్నందున హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటనను సోమవారం విడుదల చేశారు.2024–25 విద్యాసంవత్సరం బీఏ (హానర్స్) ఇంగ్లిష్‌లో జనరల్ సీట్లు 9, ఎస్సీ–4, ఎస్టీ–2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 24 సీట్లు, బీఏ (హానర్స్) ఎకనామిక్స్‌లో జనరల్ సీట్లు 8, ఎస్సీ 4, ఎస్టీ 2, ఓబీసీ 7, ఈడబ్ల్యూఎస్–2, మొత్తం 23 సీట్లు ఖాళీగా ఉన్నాయి. స్పాట్ అడ్మిషన్లను ఎస్ఎస్‌సీటీయూలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనంలో అక్టోబర్ 3వ తేదీన ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తారు.స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు,టీ సీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, మెడికల్ డిక్లరేషన్ అఫిడవిట్, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/ ఎన్‌సీఎల్/ఈడబ్ల్యూఎస్/పీడబ్ల్యూడీ/డీపీ సర్టిఫికెట్లు, దరఖాస్తుదారులు ఆన్‌లైన్ దరఖాస్తును సమర్థ్ పోర్టల్‌లో పూర్తి చేయాలి. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ అధికారులు కోరారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గోల్కొండ: తెలంగాణ రాష్ట్రంలో ఎరుకల కులస్తులకు సముచిత స్థానం కల్పించడంతో పాటు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి సీతక్కను కోరారు. సోమవారం ఎరుకల సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో ఎరుకల సోదరుల కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి రూ.500 కోట్లు కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కుల సోదరులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తమ కులస్తులకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. కాగా ఈ వినతి పత్రంలోని విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి తగిన న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, సత్యనారాయణ, ఎల్లయ్య, రాజు, రమేష్, యాదగిరి, మల్లికార్జున్, డి.కృష్ణ తదితరులున్నారు.

ఎస్ఎస్ఆర్‌పై సమీక్ష



చాంద్రాయణగుట్ట: ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని ఎన్నికల ఓటర్ల జాబితా ప్రక్రియ ప్రత్యేక పర్యవేక్షణాధికారులు, డిప్యూటీ కలెక్టర్ రాంప్రసాద్, ఏఎస్‌వో పాండురగారెడ్డి సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2025 కార్యక్రమంలో భాగంగా నర్కీపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో డీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు మాట్లాడుతూ..ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. బీఎల్‌వోలు చేపడుతున్న ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియపై సంబంధిత సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం ప్రత్యేక అధికారులు సంతోష్‌నగర్, ఫలక్‌నుమాలోని పలు ప్రాంతాలలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, ఫలక్‌నుమాలో డీసీలు శైలజ, అరుణ కుమారీలు పాల్గొన్నారు.

దర్గాలు, మదర్సాలు శాంతి కేంద్రాలు

గోల్కొండ: ప్రవక్త మహ్మద్‌ని శాంతి మార్గం అని ఆయన ఎప్పుడు శాంతిని ప్రబోధించేవారని ఆల్ ఇండియా భీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. సోమవారం సమద్ ఉల్లా షా హజ్రత్ వార్షికోత్సవాల సందర్భంగా గోల్కొండలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇస్లాం మతంలో ప్రవక్త మహ్మద్‌తో పాటు మరేందరో ప్రవక్తలు కఠిన పరిస్థితుల్లో సైతం దైవ మార్గాన్ని అనుభవించిన వారే అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ షా సమదుల్లా, దర్గా ఖాదీమ్ మహ్మద్ ఉస్మాన్, అబ్దుల్ జావిద్ ఖాన్, కారీ నూర్ మహ్మద్ షా ఖాద్రీ, అబ్దుల్ రజాక్ ఖాద్రీ, కారీ గులామ్ మహ్మద్ పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

గోల్కొండ: వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతిన్నాయని వాటిని సాధ్యమైనంత తొందరలోనే మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బుల్కాపూర్ నాలా, టోలిచౌకీ నదీమ్ కాలనీలోని శాతం చెరువులను పరిశీలించారు. అనంతరం టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. టోలిచౌకీ డివిజన్‌తో పాటు నానల్‌నగర్ డివిజన్‌లో భారీ వర్షం కురిసిన ప్రతిసారి ప్రజలతో పాటు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టోలిచౌకీ చౌరస్తాలోని వ్యాపారసముదాయాల్లో ఒకేసారి వరద నీరు చేరుతుందని దీన్ని వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎన్నోసార్లు బల్దియా కమిషనర్‌తో పాటు అధికారులను వరద నీటి నివారణ చర్యలు చేపట్టాలని కోరానన్నారు. అయితే అధికారులు మాత్రం వెంటనే స్పందించడం లేదని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లీస్ అధ్యక్షులు హారూన్‌ఫారాన్, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



రామావత్ బద్ది (ఫైల్)



శ్రీకాంత్ (ఫైల్)

శంషాబాద్: బస్సులో సొంతూరికి బయలుదేరిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం చంద్రమ్మ తండాకు చెందిన రామావత్ బద్ది (45) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె సోదరుడు నగరంలో ఆసుపత్రిలో చూపించాడు. ఈనెల 21 సొంతూరికి పంపేందుకు ఎమ్‌జీబీయస్ బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కించాడు. కొంత సమయం తర్వాత ఆమె ఫోన్‌కు సోదరుడు ఫోన్ చేయడంతో ఓ వ్యక్తి ఫోన్ ఎత్తి మహిళ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుందని, వెంటనే ఆమెను తీసుకెళ్లమని చెప్పాడు. తర్వాత కొద్ది సమయానికి ఫోన్ చేయడంతో స్విచ్చాఫ్ వచ్చింది.దీంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకి లభించకపోవడంతో సోమవారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్ రూరల్: గ్రామం నుంచి వ్యక్తి అదృశ్యమైన ఘటన పిల్లోనిగూడలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పానుగంటి శ్రీకాంత్(33) ఈ నెల 20 నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అత్తాపూర్: కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రతుకుదెరువు కోసం 15 సంవత్సరాల క్రితం శకుంతల(35), బాబురావు(40) భార్యభర్తలు మారుతీనగర్ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. ఈ నెల 19న పనికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన బాబురావు తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులు, చుట్టుప్రక్కల ఎంతవెతికినా ఆచూకి లభించకపోవడంతో శకుంతల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్లాక్ డేను పాటించిన ఆర్టీసీ కార్మికులు



నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

రాజేంద్రనగర్: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని నిరసనగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజేంద్రనగర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు బ్లాక్ డేను పాటించారు. ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి కృష్ణ, రాజేంద్రనగర్ డిపో కార్యదర్శి వడ్డే చంద్రయ్యలు మాట్లాడుతూ.. కొత్త లేబర్ కోడ్స్ అమలైయితే కార్మికులు ప్రస్తుతం ఉన్న రక్షణలన్నీ కోల్పోయి పూర్తిగా యజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పని చేయాల్సి వస్తుందన్నారు. లేబర్ కోడ్స్ రాకముందే ఆర్టీసీ కార్మిక ఉద్యమంపై ఆంక్షలు విధించారని ఆర్టీసీలో కార్మిక సంఘాలకు 6 సంవత్సరాలుగా ఎన్నికలే నిర్వహించలేదన్నారు. త్వరలో యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు అనుమతించాలన్నారు. 29 కార్మిక చట్టాల అమలులో ఉండగానే కార్మికులు బానిసత్వం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే కార్మికుల పరిస్థితి మరీ దుర్భరంగా ఉంటుందని, వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పెద్ద ఎత్తున నల్ల రిబ్బన్ బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు చారి, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



క్లీనింగ్ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: 'స్వచ్ఛతా హీ' సేవా 2024 కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛతా, సంస్కార్ స్వచ్ఛతా అనే థీమ్‌తో సోమవారం డంపింగ్ యార్డు కొత్వలగూడలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అలాగే గణపతి నిమజ్జనం జరిగిన పీరంచెరువు, కిస్మత్‌పూర్ బ్రిడ్జిల వద్ద క్లీనింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లపై నిలిచిపోయిన మురుగునీటి తొలగింపు పనులను చేపట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేష్, పర్యావరణ ఇంజనీర్ శ్రావణ్, శానిటరీ జవాన్లు సురేష్, జగన్, యాదగిరి పాల్గొన్నారు.

చెస్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా శివాంషిక



విద్యార్థినీ శివాంషికను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం



విద్యార్థినీని అభినందిస్తున్న ప్రసాద్ రావు

అత్తాపూర్: లాల్ బహదూర్ స్టేడియంలో శని, ఆదివారాలు చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చెస్ హ్యూమన్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా శివాంషిక నిలిచింది. ఈ సందర్భంగా చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్ రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో తమిళనాడులో జరిగే అక్టోబర్ 3 నుంచి 13వ తేది వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శివాంషిక నగరంలో శిక్షణ దొరుకుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేరింది. ప్రముఖ చెస్ క్రీడాకారుడు అమిత్ పాల్ సింగ్ వద్ద శిక్షణ తీసుకుంటూ తమ పాఠశాలలోనే 9వ తరగతి చదవడం తమకెంతో గర్వ కారణంగా ఉందని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

ప్రత్యేక పూజలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోకరి సురేష్‌గౌడ్

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ఎర్రకుంట తండా వద్ద మహాబోగ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గోర్ మలావ్ యజ్ఞం పూజ సేవాలాల్ మహరాజ్ పూజలు జరిగాయి. లంబాడి జాతికి చెందిన సుమారు 1500 మంది ఈ పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్ గౌడ్, గోర్ సేవా కమిటీ నాయకులు హీరాలాల్ నాయక్, గోపాల్, స్వామి, గోవింద్‌నాయక్, బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, చందర్‌నాయక్, సంజునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో సభ్యులు

మహిళలు స్వశక్తితో రాణించాలి



ఖానాపూర్‌లో విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లోని ఇందిరా మహిళా శక్తి సంఘం సభ్యులు రూ. 3 లక్షలతో పర్యావరణ హిత విస్తరాకుల తయారీ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఇలాంటి ఉత్పత్తులను తయారు చేసి రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం మార్కెట్ చెత్త పేపర్లతో తయారు అవుతున్న విస్తరాకులతో క్యాన్సర్ లాంటి రోగాలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఇలాంటి విస్తరాకులను వినియోగించాలన్నారు. మహిళలు డ్వాక్రా సంఘాలుగా ఏర్పడి స్వశక్తితో తమకు నచ్చిన వ్యాపారాన్ని చేపట్టి ఆర్థికంగా రాణించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

మన ఇంటి పరిసరాలతో పాటు వీధి, వార్డు, మున్సిపాలిటీ వ్యాప్తంగా పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం ఖానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో 'స్వచ్ఛత హి సేవ', 'పచ్చదనం–పరిశుభ్రత' అనే కార్యక్రమాలపై అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, విజిత ప్రశాంత్ యాదవ్, శ్రీకాంత్‌రావు, యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మాజీ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.